5వ తేదీలోగా పది పరీక్ష ఫీజు చెల్లించాలి

వికారాబాద్, జనవరి 27: మార్చి నెలలో జరగనున్న ఎస్ఎస్‌సీ, ఓఎస్ఎస్‌సీ, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు రూ.వేయి ఆలస్య రుసుముతో ఫిబ్రవరి 5వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో రేణుకాదేవి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రాంరెడ్డి తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు.

- మొబిలిటీ వ్యాలీ కోసం భూములు సేకరించిన గత ప్రభుత్వం
- భూబాధితులకు పూర్తి పరిహారం ఎప్పుడో?
- గతేడాది రైతులతో సమావేశమైన అధికారులు
- పరిహారం డబ్బులు తక్కువ వస్తే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచన
- డబ్బుల చెల్లింపుల్లో అక్రమాలు
- పట్టాలు లేకపోయినా కొందరికి పరిహారం అందజేత!
- సమగ్ర విచారణ జరపాలంటున్న నిర్వాసితులు

మొబిలిటీ వ్యాలీ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులు ప్రభుత్వం అందించే పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. రైతుల నుంచి భూములు సేకరించడంలో చూపిన ఉత్సాహాన్ని అధికారులు భూ నిర్వాసితులకు పరిహారం అందజేయడంలో చూపడం లేదు. అంతేకాకుండా భూములు కోల్పోయిన రైతులకు, అనుభవదారులకు అందాల్సిన పరిహారం పంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. దీంతో భూములు కోల్పోయి, పరిహారం చేతికి రాక ఇబ్బందులు పడుతున్నారు.



ప్రభుత్వం సేకరించిన భూములు

పరిహాసం!

ఎన్కతల భూ బాధితులకు పరిహారం చెల్లింపుల్లో కోత

వికారాబాద్, జనవరి 27: మోమిన్‌పేట మండలం ఎన్కతల గ్రామ శివారులో 174, 196 సర్వేనెంబర్లలో 906.08 ఎకరాల భూములను మొబిలిటీ వ్యాలీ ఏర్పాటుకు గత ప్రభుత్వం భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు రైతుల నుంచి 636 ఎకరాల భూములను సేకరించారు. భూములు కోల్పోయిన పట్టా రైతులకు, అనుభవదారులకు ఎకరాకు రూ.17లక్షల వంతున చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూ బాధితులకు ప్రభుత్వం విడుదల చేసింది. అయితే భూములు కోల్పోయిన రైతులకు, అనుభవదారులకు అందాల్సిన పరిహారం పంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. పరిహారం అనర్హులకు దక్కిందని, ఈ వ్యవహారంలో కోట్ల రూపాయలు చేతులు మారాయంటూ 2023, సెప్టెంబరు 28న ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో 'పరిహారం పక్కదారి...!' శీర్షికన ప్రముఖంగా ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు మోమిన్‌పేటకు వెళ్లి వివరాలపై ఆరా తీశారు. గతేడాది సెప్టెంబరు 29న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో విజయకుమారితో కలిసి మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. భూసేకరణ చేపట్టిన సమయంలో మోమిన్‌పేట మండలంలో పనిచేసిన రెవెన్యూ అధికారులను కూడా ఈ సమావేశానికి పిలిపించారు. పరిహారం పంపిణీలో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, అర్హులకు న్యాయం జరిగేలా బాధితులు అధికారులతో మొరపెట్టుకున్నారు.



సేకరించిన భూమిలో హద్దులు

మళ్లీ దరఖాస్తు చేసుకున్న బాధిత రైతులు

ఇదిలా ఉంటే, అధికారులు భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తామన్నారు. రావాల్సిన పరిహారం కంటే తక్కువ వస్తే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించి వెళ్లిపోయారు. పట్టా ఉన్నా పరిహారం రాని రైతులతో పాటు రికార్డుల్లో నమోదైన భూవిస్తీర్ణం మేరకు పరిహారం కాకుండా తక్కువ పరిహారం అందిన రైతులు తమ సమస్యను విన్నవిస్తూ దరఖాస్తు చేసుకున్నారు. భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని, ఎంత విస్తీర్ణం మేర భూములు కోల్పోతే అంతవరకు ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే నాలుగు నెలలు గడుస్తున్నా అటు వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిహారం పంపిణీలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్న అధికారులు నెలలు గడుస్తున్నా తమ గోడు పట్టించుకోవడం లేదని భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు కాకుండా అక్రమార్కులకు డబ్బులు

ఎన్కతల శివారులో మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన భూముల్లో ఇప్పటి వరకు 636 ఎకరాల భూమిని అధికారులు స్వాధీనం చేసుకోగా ఇంకా అక్కడ 270.8 ఎకరాలు స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. కాగా, ఇంతవరకు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న 636ఎకరాలకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు చెల్లించే పరిహారంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఎన్కతల గ్రామంలో భూపట్టాలు ఉన్న రైతుల ఖాతాల్లో అరకొర పరిహారం డబ్బులు జమ చేసిన అధికారులు ఈ భూములతో సంబంధం లేని వ్యక్తుల పేర్లు రికార్డుల్లో నమోదుచేసి వారికి పెద్దమొత్తంలో పరిహారాన్ని దారి మళ్లించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో గ్రామస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అధికారులు పెద్ద మొత్తంలో కమిషన్లు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో మోమిన్‌పేట మండలం ఎన్కతల శివారులో సేకరించిన భూములకు సంబంధించి పరిహారం చెల్లింపుల్లో చోటుచేసుకున్న అక్రమాలకు అధికారులు కూడా వత్తాసు పలికారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి ప్రజాప్రతినిధులకు అధికారులు వత్తాసు పలకడం వల్లే తమకు న్యాయం జరగలేదని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. కాగా, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం, కొత్త ఎమ్మెల్యే పాలనలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎన్కతల రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎన్కతల భూముల వ్యవహారంలో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి భూములు కోల్పోయిన రైతులందరికీ పూర్తిస్థాయిలో పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అదే క్రమంలో గ్రామానికి, గ్రామం భూములకు సంబంధం లేని వ్యక్తులకు అక్రమంగా ముట్టజెప్పిన పరిహారం డబ్బులను సైతం వసూలు చేయాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆ నేత చెబితేనే...

ఈ వ్యవహారమంతా మోమిన్‌పేట మండలానికి చెందిన ఓ బడా నాయకుడి చెప్పుచేతుల్లో కొనసాగిందని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఓ ప్రజాప్రతినిధి అండదండలతో ఉండడంతో అధికారులు సైతం వారు ఏవిధంగా చెబితే ఆ విధంగా చేసి భూములు కోల్పోయిన రైతులకు అందాల్సిన పరిహారాన్ని అప్పనంగా కాజేశారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఎవరికి వారు చేతికందినంత దోచుకుని రైతుల నోట్లో మట్టి కొట్టారని వాపోతున్నారు. మొబిలిటీవ్యాలీలో భూములు కోల్పోయిన విస్తీర్ణం ప్రకారం రైతులకు పరిహారం అందించి తమకు న్యాయం చేయాలంటూ గత ప్రభుత్వ హయాంలో ఎన్కతల రైతులు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తిరగని కార్యాలయమమంటూ లేదు. అయినా ఇంత వరకు ఎవరూ స్పందించలేదని బాధిత రైతులు వాపోతున్నారు.

పరిహారంలో కోత పెట్టారు



మొబిలిటీ వ్యాలీ కోసం నా పేరిట ఉన్న 2.06 ఎకరాల భూమిని అధికారులు స్వాధీనం చేసుకుంటే 1.17ఎకరాల పరిహారం మాత్రమే నా ఖాతాలో జమ చేశారు. నాకు ఇంకా రావాల్సిన మిగతా 29గుంటల పరిహారం కోసం నేను తిరుగని కార్యాలయం లేదు. మేము కోల్పోయిన భూముల విస్తీర్ణం ప్రకారం మాకు రావాల్సిన పరిహారం పూర్తి స్థాయిలో అందేలా విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- కుమ్మరి యాదయ్య, రైతు, ఎన్కతల, మోమిన్‌పేట

ఉన్నతాధికారులు స్పందించాలి



తక్కువ పరిహారం వచ్చిన రైతులు పరిహారం కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించిన అధికారులు నెలలు గడిచినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నా పేరిట 2.06 ఎకరాలు ఉంటే కేవలం 26గుంటల పరిహారం మాత్రమే నాకు ఇచ్చారు. మిగతా పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. ఉన్నతాధికారులు స్పందించి పరిహారం మొత్తం అందేలా చర్యలు తీసుకోవాలి.

- చాకలి బుచ్చమ్మ, రైతు, ఎన్కతల, మోమిన్‌పేట

కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్



సీఎం రేవంత్‌రెడ్డితో తీగల కృష్ణారెడ్డి

- సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే తీగల
- ఆయన దారిలోనే కోడలు జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి?
- జడ్పీ పీఠాలపై కాంగ్రెస్ కన్ను
- అదే రీతిలో మున్సిపల్, కార్పోరేషన్లు హస్తగతానికి స్కెచ్
- నాతో పాటు ఇంకా పెద్దనేతలే వస్తున్నారు: తీగల

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, జనవరి27): పార్లమెంట్ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో అధికార కాంగ్రెస్ చేరికలపై దృష్టిసారించింది. ప్రతిపక్ష బీఆర్ఎస్‌లోని ముఖ్యనేతలను, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులే టార్గెట్‌గా 'ఆపరేషన్ ఆకర్ష్' మొదలు పెట్టింది. కీలక నేతలతో మంతనాలు మొదలు పెట్టింది. దీని పర్యావసానంగా మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ నగర మాజీమేయర్ తీగల కృష్ణారెడ్డి బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చారు. శనివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఆయన మీర్‌పేటలో బహిరంగసభ నిర్వహించి అక్కడ సీఎం సమక్షంలో పార్టీలో చేరేందుకు ముహుర్తం నిర్ణయించుకున్నారు. కేసీఆర్ కుటుంబం తనను మోసం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాతో పాటు ఇంకా అనేక మంది పెద్దనేతలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే రేవంత్‌రెడ్డిని కలిసే ముందు తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డిజిల్లా జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి మంత్రి కొండా సురేఖను కలిశారు. తరువాత కృష్ణారెడ్డి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆ సమయంలో ఆయనతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కనిపించలేదు. అయితే ఉద్దేశపూర్వకంగానే ఆమె దూరంగా ఉన్నారా? అనేది తెలియడం లేదు. అయితే తీగల అనుచరులు మాత్రం ఆయన కోడలు అనితారెడ్డి కూడా మామ బాటలోనే నడుస్తారని చెబుతున్నారు. ఒకవేళ అదే జరిగితే రంగారెడ్డి జడ్పీ పీఠం కాంగ్రెస్‌పరం కావడం ఖాయం. అయితే పార్టీ మార్పుపై అనితారెడ్డి మనసులో మాట బయటకు చెప్పడం లేదు. నర్మగర్భంగానే మాట్లాడుతున్నారు. ఇప్పటికే మేడ్చల్ జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఇప్పుడు రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ కూడా కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమనే చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఇక వికారాబాద్ జడ్పీపీఠంపై అధికార కాంగ్రెస్ కన్నేసింది. ప్రస్తుతం ఇక్కడ మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భార్య సునీతా రెడ్డి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. వీరిద్దరితో కూడా కాంగ్రెస్ నేతలు కొన్నాళ్లుగా సంప్రదింపులు జరుపుతున్నారు. పార్లమెంట్ షెడ్యూల్‌కు ముందుగానే రంగారెడ్డి, వికారాబాద్ జడ్పీ స్థానాలను కైవసం చేసుకునే దిశగా అధికార కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. మెజార్టీ జడ్పీ సభ్యులను పార్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వీటితో పాటు మున్సిపల్, కార్పోరేషన్లను హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది.

రోడ్డెక్కిన వేరుశనగ రైతులు

- వ్యాపారులు, మార్కెట్ అధికారులు కుమ్మక్కయ్యారని ఆగ్రహం
- గంటల తరబడి ఆందోళన
- పోలీసులతో వాగ్వాదం.. నిలిచిపోయిన బీట్లు

పరిగి, జనవరి 27: పరిగిలో వేరుశనగ రైతులు రోడ్డెక్కారు. పరిగి వ్యవసాయ మార్కెట్‌లో అధికారులు,వ్యాపారులు కుమ్మక్కై తమను దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ందోళన చేపట్టారు. రోడ్డుపై వేరుశనగ బస్తాలను పారబోసి కొందరు రైతులు తాళ్లతో ఉరి వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. గంటల తరబడి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. వేరుశనగలు గతవారం క్వింటాలుకు రూ.8 వేల నుంచి రూ.8500 వరకు ధర పలకగా శనివారం రూ.6000 నుంచి రూ.6500లోపు కొనుగోలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పరిగి మార్కెట్‌కు శనివారం ఆరు వేలకుపైగా వేరుశనగ బస్తాలు వచ్చాయి. రైతుల ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులకు, రైతులకు మధ్య తోపులాట ఉద్రిక్తతకు దారితీసింది. పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి వచ్చి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇవ్వడంతో శాంతించి మార్కెట్ కార్యాలయానికి వెళ్లారు. అయితే అక్కడా ఆందోళన చేశారు. వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి రైతులతో చర్చలు జరిపారు. బీట్లు నిర్వహిద్దామని అధికారులు చెప్పినా రైతులు వినకపోవడంతో బీట్లు రాత్రి వరకూ నిర్వహించలేదు.



ఉరితాళ్లతో నిరసన వ్యక్తం చేస్తున్న వేరుశనగ రైతులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

సాంకేతికరంగ అభివృద్ధికి ప్రోత్సాహం

రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు

కీసర, జనవరి27: రాష్ట్రంలో సాకేంతిక రంగం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కీసర మండల పరిధిలోని రాంపల్లి దాయరలోని బాల వికాస కేంద్రంలో సామాజిక వ్యాపార స్టార్టప్ సమ్మిట్ ఇంపల్స్-2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో సాకేంతిక అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన కృషి ఏనలేనిదన్నారు. అదే విధంగా రాష్ట్రంలో సాకేంతిక రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఐటీ సెక్టార్‌కు కావాల్సిన ప్రోత్సహకం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆధునాతన ఆలోచనలతో స్టార్టప్ కంపెనీలు సామాజిక మార్పుకు దోహదపడే ఆవిష్కరణలు రూపొందించాలన్నారు.స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు బాలవికాస కేంద్రం చేస్తున్న అభినందనీయమన్నారు. ఈ మేరకు గచ్చిబౌలిలోని పలు కంపెనీలతో స్టార్టప్ పరిశ్రమల అభివృద్ధికి బాల వికాస కేంద్రం ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా 60కి పైగా వివిధ రకాల సోషల్ స్టార్టప్‌లు తమ సామాజిక ఆవిష్కరణలు, ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బాలవికాస కేంద్రం వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా జింగ్రాస్, అరవింద్ ఐకేర్ సిస్టమ్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ ప్రజ్ఞ, బీవీరాజు విష్ణురాజు తదితరులు పాల్గొన్నారు.



నకిలీపై నజర్

- మేడ్చల్‌లో భారీగా విత్తన పరిశ్రమలు
- నకిలీ విత్తనాలు అరికట్టే దిశలో జిల్లా యంత్రాంగం

మేడ్చల్‌టౌన్, జనవరి27: మేడ్చల్ ప్రాంతం విత్తనాల పరిశ్రమలకు పెట్టింది పేరు. మార్కెట్‌లో లభించే అన్ని రకాల విత్తనాలు తయారు చేసే చిన్న, పెద్ద పరిశ్రమలు ఇక్కడే ఉన్నాయి. ప్రభుత్వం రాయితీలు, మినహాయింపులు ఇవ్వడంతో చాలా మంది విత్తన శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. 30ఏళ్ల క్రితం మేడ్చల్ ప్రాంతంలో రెండుమూడు విత్తన పరిశ్రమలు ఉండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య దాదాపు 60కి చేరింది. అయితే వీటిలో కొన్ని పరిశ్రమలు నిబంధనలను తుంగలో తొక్కి తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగిస్తున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్షలో నకిలీవిత్తనాల సరఫరా ఉగ్రవాదం కన్న ప్రమాద కరనమని హెచ్చరించడంతో జిల్లా యంత్రాంగం నకిలీ విత్తన పరిశ్రమల తయారీ కేంద్రాలపై దృష్టి సారించింది. మేడ్చల్‌లోని విత్తన కంపెనీల నుంచి స్థానికంగానే కాకుండా దేశంలోని నలుమూలలా ఇక్కడి నుంచి విత్తనాలు సరఫరా అవుతాయి. ఈ క్రమంలో ఇక్కడ నకిలీ విత్తనాల తయారీకి వీలు లేక పోలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ విత్తనాల అరికట్టాలన్న ఉద్దేశంతో సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో నకిలీ విత్తనాలు నిల్వ చేసే గోదాములపై దాడులు నిర్వహించి కోట్ల రూపాయల విలువ చేసే విత్తనాలు స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసులు కొందరు అక్రమార్కులు తమకు కావాల్సిన విత్తనాలను పేరుగాంచిన పరిశ్రమల నుంచి రెమినెంట్‌గా(పాడైనవిత్తనాలు) కొనుగోలు చేసి తిరిగి వాటిని రీప్యాక్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పేరుగాంచిన పెద్ద పరిశ్రమలు తమ వద్ద ఉన్న మొక్కజొన్న, బాజుర్, ప్యాడీ, పొద్దు తిరుగుడు, బీటీ పత్తి విత్తనాల జర్మినేషన్ (పంట పండే సామర్థ్యం.) 85 శాతానికి తగ్గకుండా పరీక్షలు చేసి విత్తనాలను మార్కెట్‌లో విక్రయిస్తారు కాగా కొన్ని విత్తనాలు అమ్ముడు పోక అవి తిరిగి కంపెనీలకు చేరుకుంటాయి. ఇలాంటి విత్తనాలను తిరిగి జర్మినేషన్ పరీక్షలు నిర్వహించి వాటిలో పంట పండించే సామర్థ్యం ఒక వేళ 85 శాతానికి తగ్గితే వాటిన పనికిరాని విత్తనాల (రెమినెంట్స్) కింద ఎంతో కొంతకు అమ్మేస్తారు. ఇలాంటి విత్తనాలను తిరిగి కొందరు కొనుగోలు చేసి జర్మినేషన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 60శాతం పంట దిగుబడి సామర్థ్యం(జర్మినేషన్)ఉంటే వాటిని తిరిగి తమ బ్రాండ్‌పై రీ ప్యాకింగ్ చేసి ధర తగ్గించి మార్కెట్‌కు తరలిస్తున్నారు.

అనుమతులు లేని పరిశ్రమలు

ఇదిలా ఉండగా, పంటల సీజన్లలో ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక విత్తన కంపెనీలు మేడ్చల్ ప్రాంతంలోని పలు విత్తనాల ప్రాసేసింగ్ ప్లాంట్లను సంప్రదించి విత్తనాలు కొనుగోలు చేస్తున్నాయి. తిరిగి వాటినితమ ప్రాంతాలకు తీసుకుపోయి వాటిని రైతులకు అంటగడుతున్నారు. అంతేకాకుండా కొన్ని విత్తన కంపెనీలు అనమతులు లేకుండా, మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో ఇతర రాష్ట్రాల్లోని విత్తన విక్రేతలకు నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారు. దీంతో ఇక్కడ పరిశ్రమల నుంచి మార్కెట్‌లోకి వెళ్తున్న విత్తనాలు నాణ్యమైనవా? లేక నకిలీ విత్తనాలా తేల్చలేని పరిస్థితులు నెలకొన్నాయి.

అనుమతి లేని ప్లాంట్ల పై చర్యలు



మేడ్చల్ పరిధిలోని సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించి వివరాలు సేకరిస్తున్నాం. నకిలీ విత్తనాల రాకెట్‌నుఅరెకట్టేందుకు ప్రత్యేక బృదాలు ఉన్నాయి. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రత్యేక స్క్వాడ్స్‌లు విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్లలో తనిఖీలు నిర్వహించి పూర్త వివరాలు సేకరిస్తున్నాయి. అనుమతులు లేకుండా విత్తన శుద్ధి కేంద్రాలను నడిపితే సీజ్ చేయటంతో పాటు సంబంధిత వ్యక్తుల పై కేసు నమోదు చేస్తాం

- అర్చన, ఏవో మేడ్చల్

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, జనవరి 27 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వికారాబాద్‌లో నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపె పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్మెంటల్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జనరల్ లో 35, ఒకేషనల్ లో 13 ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జనరల్ ద్వితీయ సంవత్సరంలో 4177మంది సైన్స్ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులలో మొదటి సంవత్సరంలో 1352 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 1259 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభమవుతాయని అదేవిధంగా ఫిబ్రవరి 15 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాల్లో కంప్యూటర్, ప్రింటర్‌తో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులు సమయానికి హాజరుకావాలని సూచించారు.



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

రెండు కిలోల గంజాయి పట్టివేత

● ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములు

కొడంగల్ రూరల్, జనవరి 27: గంజాయిని తరలిస్తుండగా శనివారం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని రావుల్‌పల్లి చెక్‌పోస్టు సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని రావుల్‌పల్లి చెక్‌పోస్టు సమీపంలో ఎస్సై భరత్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్, కానిస్టేబుళ్లు నరేందర్‌రెడ్డి, కృష్ణ, బాబు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం మోదిన గ్రామానికి చెందిన హుసేనప్ప, నాగరాజు, కొడంగల్ మండలంలోని రావుల్‌పల్లి గ్రామానికి చెందిన దస్తప్పలు కర్ణాటక నుంచి కొడంగల్‌కు వస్తుండగా వారి బైక్‌ను తనిఖీ చేశారు. ఓ బ్యాగులో రూ.40వేల విలువైన రెండు కిలోల గంజాయి పట్టుబడింది. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని కొడంగల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. ఆరు నెలలుగా కర్ణాటక నుంచి కొడంగల్‌కు తరలించి పరిసర ప్రాంతాల్లో కిలో గంజాయి రూ.20వేలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాములు చెప్పారు. గంజాయితో భవిష్యత్తును ఆగం చేసుకోవద్దని అన్నారు.

సంపూర్ణ పారిశుధ్యాన్ని పాటించాలి



డీపీవోను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

యాలాల, జనవరి 27: గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యాన్ని పాటించాలని జిల్లా పంచాయితీరాజ్ అధికారి తరుణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం పంచాయితీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో వందశాతం ఇంటి పనులను జనవరి 31లోపు ఈ పనులు చేయాలన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి అన్ని రికార్డులు సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో త్రాగునీరు సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలీల, ఎంపీఈవో యాదయ్య, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

తాండూరు అభివృద్ధికి రూ.100 కోట్లు

- మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- యాభై రోజుల్లోనే ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మార్క్ అభివృద్ధి
- బాగుపడనున్న రోడ్లు, డ్రైనేజీలు, స్కూళ్లు, మరుగుదొడ్లు
- త్వరలో పనులు ప్రారంభిస్తాం: ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జనవరి 27: తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి దండిగా నిధులు మంజూరు అయ్యాయి. రూ.100కోట్ల నిధులను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేశారు. స్థానిక ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిశారు. ఎన్ఆర్ ఈజీఎస్, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్), నియోజకవర్గ గ్రామీణ రోడ్ల అభివృద్ధి (సీఆర్ఆర్) కింద రూ.100కోట్లతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వెల్లడించారు. నియోజకవర్గంలో పాత పనులు రద్దు అయినందున గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో పంచాయితీ రాజ్ రోడ్లు, స్కూళ్లు, భవనాల నిర్మాణం, మరుగుదొడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణం చేపడతామని తెలిపారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. కేవలం జీవోలకే పరిమితం కాకుండా సకాలంలో పనులను నాణ్యతాయుతంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు కోరిన విధంగా దశల వారీగా తాండూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

క్రీడలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు



హనుమంత్ నాయక్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 27: క్రీడలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల అదనపు కార్యదర్శి హనుమంత్ నాయక్ తెలిపారు. మండలంలోని అంకుషాపూర్ ప్రిన్సిటన్ కళాశాల ఆవరణలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల బుద్వేల్‌లో 7వ రాష్ట్రస్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 30మంది మహిళా డిగ్రీ కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ క్రీడలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ జలజాసత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ శోభారాణి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలల అధికారులు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, లక్ష్మి, క్రీడాకారులు, పీడీలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు

- ఎమ్మెల్యే మల్లారెడ్డి



తిమ్మాయిపల్లిలో ఎస్సీ కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర, జనవరి 27: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే మల్లారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్, ఉపసర్పంచ్ భాగమ్మ, ఎంపీటీసీ ప్రమీల ఆమరేందర్‌రెడ్డి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలి

ఘట్‌కేసర్ రూరల్: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటి ముందుకు సాగాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. మండలంలోని ఎదులాబాద్ ఏ.ఎన్ క్రికెట్ మైదానంలో జరిగే మల్లారెడ్డి క్రికెట్ పోటీల బ్రోచర్‌ను మల్లారెడ్డి శనివారం నగరంలోని ఆయన నివాసంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభమైవుతాయని, గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు చేయూతన ఇవ్వడానికే క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి హెల్త్ సిటి డైరెక్టర్ చామకూర మల్లారెడ్డి, చామకూర మహేందర్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, ఫీడి ఎర్రోళ్ళ శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, నాయకులు మంకం రవి, కానుగంటి శ్రీనివాస్, చిరంజీవి, శంకర్, యంపాల సుధాకర్‌రెడ్డి, పల్లవు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సీఐ, ఎస్ఐ

కొడంగల్ రూరల్, జనవరి 27: కరాటే ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతుందని కొడంగల్ సీఐ రాములు, ఎస్ఐ భరత్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లో తెలంగాణ నాంచాక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కరాటే మాస్టర్ మనోహర్, వైస్‌ప్రసిడెంట్ గంటి సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నవీన ఆదర్శ కాన్వెంట్ పాఠశాలలో నిర్వహించిన తైక్వాండో పోటీలను వారు ప్రారంభించారు. 6 సంవత్సరాలుగా విద్యార్థులకు తైక్వాండో కరాటే శిక్షణను ఉచితంగా అందిస్తున్న కరాటే మాస్టర్ సురేశ్‌ను వారు అభినందించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశాంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నవీన ఆదర్శ కాన్వెంట్ పాఠశాల ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్ సీఐ రాములు, ఎస్ఐ భరత్‌రెడ్డి, కరాటే మాస్టర్లు మనోహర్, సురేశ్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంతోష, విద్యార్థులు పాల్గొన్నారు.

మహావీర్ ఆసుపత్రికి అవార్డు



అవార్డును అందుకుంటున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 27: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ ద్వారా జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహావీర్ జనరల్ ఆసుపత్రికి గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని అవార్డు వరించింది. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వేడుకల్లో మహావీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ హాస్పిటల్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

తాండూరు రూరల్ సీఐగా అశోక్‌కుమార్



బాధ్యతలు చేపట్టిన అశోక్‌కుమార్

తాండూరు, జనవరి 27: తాండూరు రూరల్ సీఐగా అశోక్ కుమార్ బదిలీపై రానున్నారు. జడ్చర్లలో అశోక్‌కుమార్ ట్రాఫిక్ సీఐగా పనిచేసి ఇటీవల జిల్లా శిక్షణ కేంద్రానికి సీఐగా బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి తాండూరు రూరల్ సీఐగా తాండూరుకు బదిలీపై రానున్నారు. తాండూరు రూరల్ సీఐగా రెండేళ్లపాటు పనిచేసిన రాంబాబు ఐజీ కార్యాలయానికి బది లీపై వెళ్ళనున్నారు.

యాలాల ఎస్ఐగా శంకర్

యాలాల: యాలాల మండల నూతన ఎస్ఐగా శంకర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న అరవింద్ తాండూరుకు బదిలీ అయ్యారు.

నాగారంలో అభివృద్ధి పనులకు ఆమోదం

కీసర, జనవరి 27: నాగారం మున్సినల్ పరిధిలోని పలు ప్రాంతాల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపినట్లు చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఈమేరకు నాగారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు, పట్టణ ప్రగతి నిధులు మొత్తం 3.50కోట్ల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపినట్లు చైర్మన్ చంద్రారెడ్డి తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ పాలకవర్గం సభ్యుల పదవీ కాలం నాలుగు వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రాజేందర్, వైస్‌చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



ట్రోఫీ అందుకున్న విజేతలు

మేడ్చల్‌టౌన్, జనవరి 27: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తామని జడ్పీటీసీ శైలజ విజయేందర్ రెడ్డి అన్నారు. శ్రీరంగవరం లో సర్పంచ్ విజయేందర్ రెడ్డి నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు శనివారం బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విన్నర్‌గా నిలిచిన రేజింగ్ బ్లూ జట్టుకు, రన్నరప్‌గా నిలిచిన ఈగల్ జట్టుకు షీల్డ్‌లను అందజేశారు.

వేణునాదంతో మైమరపించిన విద్యార్థులు



విద్యార్థి మురారికి జ్ఞాపికను అందజేస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 27: పూడూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వేణునాదంతో సభికులను అబ్బురపరిచారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు చేయగా, పూడూరు మండలం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 9వ తరతగతి చదువుతున్న వజ్ర నిర్ఘోష, 7వ తరగతి చదువుతున్న విద్యార్థి పి.మురారిలు మురళి గానంతో మైమరపించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ వారికి శిక్షణ ఇచ్చిన ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌ను అభినందించారు. అనంతరం విద్యార్థుల ప్రతిభను ప్రశంసించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, డీఆర్డీఓ కృష్ణన్ , సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ రాంరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, పశుసంవర్ధక శాఖ అధికారి సునిల్, మైన్స్‌ఏడీ జాకబ్, డీపీఆర్ ఎండీ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పరిగికి కేటీఆర్ రాక

పరిగి, జనవరి 27: ఈనెల 29న సోమవారం పరిగికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నట్లు పార్టీపరిగి మండల అధ్యక్షుడు ఆర్.అంజనేయులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు పరిగిలోని ఎస్ గార్డెన్‌లో పరిగి నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరుగుతుందని, ఈ సమావేశానికి కేటీఆర్‌తోపాటు, పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, జనవరి 22: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.ఆనంద్ రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు కలిశారు. హైదరాబాద్‌లో శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు.

బొంరాస్‌పేట్: మహంతీపూర్, లింగంపల్లి, కొత్తూర్, వడిచర్లతో పాటు ఎనిమిది తండాల సర్పంచ్‌లు మహిపాల్, కాశప్ప, మహేందర్, డాక్యనాయక్ తదితరులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లో శనివారం వారు సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

యువకుడిని కాపాడిన 108 సిబ్బంది

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 27: యంనంపేట్ వంతెన సమీపంలో శనివారం సాయంత్రం భువనగిరి వైపు వస్తున్న రైల్లో నుంచి ఓ యువకుడు యంనంపేట్ వంతెన సమీపంలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహనసిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. యువకుడు విమల్‌గా గుర్తించారు. 108సిబ్బందిని పలువురు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్, జనవరి 27: మండలంలోని జినుగుర్తి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వై. ప్రకాష్ తెలిపారు. వచ్చే 2024-2025 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి 22వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. అదేవిధంగా 7నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను కూడా భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



సెలూన్‌లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

తాండూరు జనవరి 27: మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూరు ఎక్సైజ్ సీఐ అనంతయ్య హెచ్చరించారు. తాండూరు పట్టణంలో సెలూన్లు, బెకరీలు, పాన్ షాపులను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎక్కడా మత్తు పదార్థాలు లభ్యం కాలేదని తెలిపారు. గంజాయి లేదా ఇతర ఏదైనా మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే సెల్ 8712658754 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ



ఎస్టీయూ డైరీని ఆవిష్కరించిన కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కొడంగల్, జనవరి 27: ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సరం డైరీని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శనివారం ఆవిష్కరించారు. స్థానిక కడా క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, రాష్ట్ర ఆర్థిక కార్యవర్గ సభ్యుడు పవన్‌కుమార్, సభ్యులు వెంకట్రాములు, గోపాల్, కరుణాకర్, అంజిలప్ప పాల్గొన్నారు.

వరినాట్ల పరిశీలన

బొంరాస్‌పేట్, జనవరి 27: నాజ్‌ఖాన్‌పల్లి గ్రామంలో వరినాట్లను వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ పరిశీలించారు. గ్రామంలో శనివారం పర్యటించిన ఆయన పంట పొలాల్లో వరినాట్లను పరిశీలించారు. ఎకరానికి 20కిలోల యూరియా, 50కిలోల డీఏపీ, 15కిలోల మ్యూరెట్ ఆఫ్ పోటాష్ ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో హేమ, సర్పంచ్ శకనప్ప, రైతులు పాల్గొన్నారు.

క్వింటాల్ రూ.10వేలు పలికిన కంది ధర

ధారూరు, జనవరి 27:ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన బీట్లలో కందుల ధర క్వింటాలు రూ.పదివేలకు తాకింది. మార్కెట్‌కు 751బస్తాలు రాగా 375.5 క్వింటాళ్ల కందుల క్రయవిక్రయాలు జరిగాయి. కందులు గరిష్ఠంగా క్వింటాల్‌కు 10,075, కనిష్ఠంగా రూ.10వేలు బీట్లలో ధర పలికింది. వాము(అజువాన్) క్వింటాల్‌కురూ.13,500లకు క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ కమిటీ సహాయ సహాయ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

'ప్రజాపాలన కొనసాగుతోంది'

ధారూరు, జనవరి 27: రాష్ట్రంలో పదేళ్ల బానిస పాలనకు చరమగీతం పాడి యాభై రోజులుగా ప్రజాపాలన కొనసాగుతోందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి పి.రఘువీరారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన యాభై రోజులు పూర్తి చేసుకోవడం పట్ల కావటం పట్ల ఆయన ప్రభుత్వానికి శుభాకాంక్షాలు తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ అహంకారం ఇంకా తగ్గలేదని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు.

సైన్స్, వేదం రెండూ వేరు

తాండూరు రూరల్, జనవరి 27: సైన్స్, వేదం రెండూ వేరని ఎంఈవో వెంకటయ్య అన్నారు. చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా విద్యార్థులకు తాండూరు మండల, పట్టణ స్థాయి ప్రతిభా పరీక్ష శనివారం నిర్వహించారు. ఎంఈవో వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృఢత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. మూఢనమ్మకాలను నమ్మరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు బందెప్ప, నిర్వహకులు నర్సింహులు, వెంకటప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణకు ఒప్పందం

మేడ్చల్‌టౌన్, జనవరి 27: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సేయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల యాజమమాన్యం శనివారం విద్యార్థులకు ఉపాధి నైపుణ్య శిక్షణకు విశాఖ పట్నం సీఎస్‌సీ అకాడమితో ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతిక సీ-డాక్, ఐఈఈఈ ద్వారా ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు విద్యార్థులకు ఎంఐఈఐటీపై, త్రీడీప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేయింట్ పీటర్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీలత, విశాఖపట్నం సీఎస్‌సీ అకాడమి సలహాదారులు వై.రాంమోహన్ రావు, కళాశాల సెక్రటరీ టీ.వీరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత కన్నుమూత

మేడ్చల్ టౌన్, జనవరి 27: గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు అమరం కృష్ణారెడ్డి గుండెపోటుతో మృతి చెందాడు. గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఇంటివద్దే చికిత్స అందించారు. శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో తుది శ్వాసవిడిచారు. గుండ్లపోచంపల్లి పంచాయతీకి 14సంవత్సరాల పాటు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించటంతో పోటు టీడీపీలో కీలక నేతగా కృష్ణారెడ్డి గుర్తింపు పొందారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల అన్ని రాజకీయ పార్టీలు సంతాపాన్ని వ్యక్తం చేశాయి. అంత్యక్రియలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

జిల్లా కోర్టుకు స్థలం కేటాయించాలి



జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి అనిల్‌కుమార్‌తో బార్ అసోసియేషన్ బృందం

వికారాబాద్, జనవరి 27 : జిల్లా కోర్టు ఏర్పాటుకు ఇరిగేషన్ శాఖలో గల 1.16 ఎకరాల స్థలాన్ని అసైన్డ్ చేసే విధంగా చొరవ తీసుకోవాలని న్యాయవాదులు కోరారు. శనివారం జిల్లా కోర్టులో జిల్లా జ్యూడిషియల్ కాన్ఫరెన్స్ నిర్వహించగా తెలంగాణ హైకోర్టు పోర్టుపోలియో, జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి అనిల్‌కుమార్ జూకంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు, బృందంతో జిల్లా నూతన సముదాయ భవన నిర్మించుకోవడానికి గల స్థలం కోసం వినతి పత్రం అందజేశారు. అదే విధంగా జిల్లా కోర్టు సముదాయానికి అనుకూలమైన ప్రదేశం రైల్వే స్టేషన్ పక్కన గల హార్టికల్చర్ స్థలాన్ని కేటాయించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవాద సంఘం అధ్యక్షులు పి. జనార్దన్‌రెడ్డి, బార్‌అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఏ.శంకరయ్య, సీనియర్ న్యాయవాదులు పరమానందరావు, చౌదరి యాదవరెడ్డి, బస్వరాజ్, గోపాల్ రెడ్డి, శంకరయ్య, శ్రీనివాస్ రావు, వసుంధర, ఏజీపీ రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



బ్రోచర్‌ను అవిష్కరిస్తున్న సీఈవో నీలిమ

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 27 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ అంకిత భావంతో పనిచేయడమే లక్ష్యమని అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ అన్నారు. మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలం, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం అనురాగ్ సెట్-2024 బ్రోచర్‌ను అవిష్కరించారు. అనురాగ్ సెట్-2024 వచ్చే నెల 11న ప్రారంభం అవుతుందని తెలిపారు. అనురాగ్ సెట్‌లో టాపర్లకు రూ. 6.5 కోట్ల స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగానే 1 నుంచి 10 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఫీజులో 100 శాతం, 11 నుంచి 25 ర్యాంకులు సాధించిన వారికి ఫీజులో 50 శాతం, 26 నుంచి 100 ర్యాంకులు పొందిన వారికి ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అలాగే అనురాగ్ సెట్ ద్వారా ప్రవేశం పొందిన మొదటి 500మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అనురాగ్ సెట్ రాసే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, డీన్లు ముత్తారెడ్డి, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **దోమ:** పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన మాన్‌సింగ్ తన భార్య కీర్తి శేషులు లాలమ్మ జ్ఞాపకార్థం కోసం పోతిరెడ్డిపల్లి పాఠశాలకు ప్రొజెక్టర్‌ను హెచ్‌ఎం నర్సింహులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ శంకర్, ఉపసర్పంచ్ గోవర్దన్, వార్డుసభ్యుడు కృష్ణ, ఉపాధ్యాయురాలు శివలీ, అంగన్‌వాడీ టీచర్ తులసి, గ్రామపెద్దలు నారాయణ, బాబీనాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.
- **తాండూరు రూరల్:** అల్లాపూర్‌లో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. వారం రోజుల కిందట డివిజన్ పంచాయతీ అధికారి గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులు చేయించాలని ఆదేశించారు. ఈ మేరకు ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ మండల అధికారి రతన్‌సింగ్ అల్లాపూర్ గ్రామానికి వెళ్లి పారిశుధ్య సిబ్బందితో డ్రైనేజీల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు.
- **ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతరకు భారీ ఏర్పాట్లు చేశారు. శనివారం అర్థరాత్రి నుంచే జాతర క్రతువు ప్రారంభమవుతుంది. ఆదివారం తెల్లవారుజామునుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఘట్‌కేసర్‌లోని ప్రతీఇంటి నుంచి అమ్మవారికి బోనం సమర్పించడం అనవాయితీ.
- **బషీరాబాద్:** నవాంద్గీ సంగమేశ్వరాలయంలో నేడు(ఆదివారం) మండల శివదీక్షామాలధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి మహంతయ్య స్వామి, శివదీక్ష బృందం సభ్యుడు పి.మాధవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహోత్సవానికి పూజ్యశ్రీ వీరతపస్వి మునీంద్ర శివాచార్యస్వామి హల్‌కట్టి శివదీక్షాధారణ చేయిస్తారన్నారు.
- **దోమ:** అయినాపూర్ గ్రామానికి చెందిన బాల్‌రాజ్ విద్యుదాఘాతంతో ఆరునెలల కిందట మృతిచెందాడు. బీఆర్ఎస్‌లో సభ్యత్వం పొందడంతో పార్టీ ఆదేశాల మేరకు బాధిత కుటుంబసభ్యులను పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి భార్య సువర్ణకు రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగిరెడ్డి పాల్గొన్నారు.

కులకచర్ల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరామర్శించారు. శనివారం మండలంలోని బండ వెల్కిచర్ల గ్రామానికి వెళ్లి లక్ష్మారెడ్డి భార్య శిరీషరెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

- **బషీరాబాద్:** మండల కేంద్రంలో నివాసముంటున్న నిర్మలమ్మ(85) శుక్రవారం సాయంత్రం మృతిచెందింది. పేద కుటుంబం కావడంతో ఆమె అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావు ఆర్థికసాయాన్ని ప్రకటించారు. మృతురాలి ఇంటికి పార్టీ శ్రేణులను పంపించి నగదు సాయాన్ని అందజేశారు.
- **పరిగి:** పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. టీఆర్ఆర్ మెడికల్ కళాశాల వారిచే వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిగి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు ఉచిత వైద్య చికిత్సలు చేయించుకోవాలని సూచించారు.
- **శామీర్‌పేట:** వచ్చే నెల 16న గ్రామీణ బంధు, సమ్మెను జయప్రదం చేయాలని రైతు సంఘం ఉపాధ్యక్షుడు సాయిలుగౌడ్, జిల్లా అధ్యక్షుడు నిమ్మల నర్సింహులు డిమాండ్ కోరారు. మండల కార్యాలయాల సముదాయంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రైతు సంఘం, బీకేఎంయు వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.
- **బషీరాబాద్:** గ్రామపంచాయతీ అభివృద్ధికి పాలకవర్గం ఎనలేని కృషి చేయాలని నవాంద్గీ పీఏసీఎస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ అన్నారు. నవాంద్గీ పంచాయతీలో శనివారం పాలకవర్గం చివరిసారిగా సాధారణ గ్రామసభ నిర్వహించారు. అనంతరం పాలకవర్గానికి ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు.
- **మేడ్చల్ టౌన్:** గ్రామంలో నిర్వహించిన మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని రాజబొల్లా రం తండా సర్పంచ్ మాంగ్యా నాయక్ శనివారంప్రారంభించారు.
- **శామీర్‌పేట:** విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్ అన్నారు. శనివారం శామీర్‌పేట మండలం తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరుగుతుండటంతో వారికి సాయంత్రం స్నాక్స్‌ను మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్ అందజేశారు.